శ్రీరస్తు.

సర్వేశ్వరశతకము.

యథావాక్కుల అన్నమయ్యకవి

విరచితము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్ వారిచే

ప్రకటితము.

1921

Printed by
V. RAMASWAMY SASTRULU & SONS
at the "VAVILLA" Press,
MADRAS.—1921.

పీఠిక

ఈశతకమును యథావాక్కుల అన్నమయ్య శా॥ శ.
64 కు సరియగు శుభకృత్సంవత్సరమున రచియించినటుల 130,
3, 142 పద్యములంబట్టి తెలియుచున్నది. ఈతఁడు కాలమును
ట్టి తిక్కన, పాలకురికి సోమనాథులకు సమకాలికుఁడుగాఁ జూ
టుచున్నాఁడు.

ఈతఁడు వీరశైవుఁడు. ఈతనిగుఱించి యాంధ్రసాహిత్య
నస్ముద్రితప్రతి పీఠికయందు
"యథావాక్కుల అన్నమారాధ్యుఁ డాత్రేయసగోత్రో
వుఁడు, యజుశ్శాఖాధ్యాయి, గోదావరీతీరవాసి, రాజమహేం
వరమునకు సమీపమున నున్న పట్టెస మనుగ్రామమందు
లసిన వీరభద్రేశ్వరస్వామి యీయనకు నిలువేలుపు. ఈ
హనీయుఁ డొకప్పుడు శ్రీశైలయాత్రకు వెడలి శ్రీమల్లి
ర్జునస్వామిని సేవించి తిరిగివచ్చుచుఁ బల్నాడుతాలూకాలో
పాలెముదాపునఁ గృష్ణాతీరమందు విశ్వామిత్రాశ్రమ మనఁ
స సత్రశాల యనుపుణ్యస్థలమున శ్రీమల్లికేశ్వరస్వామిని
ంచుచుఁ గొంతకాల ముండి యచ్చటనే యీ సర్వేశ్వర
కమును రచించెను. ఒక్కొక్కపద్య మొక్కొక్క తాటి
కుపై వ్రాసి యాయాకును గృష్ణలో వైచి యది ప్రవాహ
న కెదురీఁదివచ్చెనా దానిని దీసి సూత్రమున నెక్కించెద. అ
యాకైన రాక క్రిందికిఁ గొట్టుకొనిపోయెనా యప్పుడే నా

శిరము ఖండించికొనియెద నని శపథముచేసి మెడకు గండక
వైచుకొని యాకులమీఁదఁ బద్యముల వ్రాసి నీళ్లలో వి
పెట్టఁగా నవి తిరిగి వచ్చుచుండినవి. కొంత సేపటికి “తర
బువ్వులు పిండెల్లె రొదవి” అను 87-వ పద్య మెదుర
రాక కొట్టికొనిపోవుటఁ జూచి కంఠమును గత్తిరించికొనుట క
మించుచుండఁగా నొక పసులకాఁపరి “నా కొకతాటియాకు ద
నది చూడుఁ” డని యిచ్చి యదృశ్యుఁడయ్యెను. కవి
యాకును జూడఁగా దానిపై దాను వ్రాసినపద్యమునకు మాఱు
వేఱొక 88-వ పద్య ముండుటఁ జూచి యిది సర్వేశ్వర
మని గ్రహించి యాపద్యమును సూత్రమున కెక్కించి తాఁ
కొన్న నియమముప్రకారముననే శతకమునుఁ బూర్తిచేసి కొ
కాలమునకుఁ బిదప నాసత్రశాలయందే సిద్ధిఁబొందె”
నని గలదు. ఇయ్యది శైవభక్తిరసోద్బోధకమయి హృదయం
ముగా నున్నది. ఇందచ్చటచ్చట ప్రౌఢములగు కల్పనలు గ
ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రకటించినప్రతియందు లో
లనేకము లున్నందున నిర్దుష్టముగ ఈశతకమును ప్రక
నారము.

ఇట్లు,

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

శ్రీ ర స్తు.

స ర్వే శ్వ ర శ త క ము.

శ్రీకంఠుం బరమేశు నవ్యయు నిజశ్రీపాదదివ్యప్రభా
నీకోత్సారితదేవతానిటలదుర్నీత్యక్షరధ్వాంతుఁ జి
త్ప్రాకామ్యాంగునపాంగమాత్రరచితబ్రహ్మాండసంఘాతుజం
ద్రాకల్పుం బ్రణుతింతు నిన్ను మదినాహ్లాదింతు సర్వేశ్వరా. 1

కమా టీసకలంబు నీమయముగా నూహించుచు న్వేండి యొ
క్కమా టింతయు నీవుగా ననుచు నేయుక్తిం బ్రశంసింప నే
వేదంబులు చిక్కువడ్డ వనినం బ్రవ్యక్తమై యుండు భా
ఁ డై నీనిజరూప మిట్టి దన నెవ్వం డోపు సర్వేశ్వరా. 2

నాతీతుఁడ వై ననిమహిమఁ బ్రజ్ఞం బూని తర్కించు ట
నాంగం బగు నైననుం దమయథాశక్తిం బ్రశంసించి ది
వ్యానందస్థితిఁ బొందువారిఁ గని భక్త్యావృత్తి ని న్నిట్టివాఁ
నం బ్రస్తుతి సేయుచుండుఁ దనచే నైనంత సర్వేశ్వరా. 3

మితాంభోజభవాండభాండనిలయం బై యుండు నీయంతరం
ముప ట్టెంతయొ దాని కింక బహిరంగం బెట్టిదో నూత్నత
త్వము దా నంతకు మీఁద నేమివిధమో తా నిట్టి నీపెంపుమా
ట నీకైన నచింత్య మెట్లొరుఁ డెఱుంగం జాలు సర్వేశ్వరా. 4

మ. ఇన విఘ్నేశ్వరమాతృకాద్రుహిణ బ్రాహ్మీస్కంద దుర్గారమా
వనితాధీశ్వర భైరవుల్ బలసి భాస్వద్భక్తిసంయుక్తి నీ
కనిశంబుం బరివారభృత్యనికరం బై రన్న ని న్నింకఁ గొ
ల్వనివా రెవ్వ రజాండభాండములలో వర్ణింప సర్వేశ్వరా.

శా. ఏపారంగ నజాండభాండనికరం బేరూపులోఁ బుట్టి యు
ద్దీపించు న్మఱి రూపు లెల్ల సమసుప్తిం బొంది యేరూపులో
లోపించుం గలయంగ నంతటికిఁ దా లోనై విజృంభించి యే
రూపం బవ్యయ మై వెలుంగు నది నీరూపంబు సర్వేశ్వరా.

మ. జలజాతప్రభవాండబుద్బుదము లశ్రాంతంబునుం బుట్టుచుం
గలయం గ్రాఁగుచునుండు నీపృథులలింగస్ఫారగర్భాబ్ధిలో
పలఁ దద్బుద్బుదగర్భవాసులు హరి బ్రహ్మాదిదేవాళియుం
గలదే వారికి నీమహత్త్వ మెఱుఁగంగాశక్తి సర్వేశ్వరా.

మ. భవదున్మేషవిజృంభణంబు పరికింపంగా సరోజాతసం
భవుజన్మంబు భవన్నిమేష మమితబ్రహ్మాండకల్పాంతభై
రవసంక్షోభిత మన్నఁ దక్కిన భవత్ప్రారంభభూరిక్రియా
నివహం బెవ్వరు నేర్తు రిట్టి దని వర్ణింపంగ సర్వేశ్వరా.

మ. పవనుం డై హిమధాముఁ డై యనలుఁ డై పానీయ మై యాత్మ
రవి యై యంబర మై మహీవలయ మై రమ్యాష్టమూర్తిక్రియన్
భువనాండంబులు లక్షణాంగములుగాఁ బుట్టించు నత్యద్భుతో
త్సవలీలావిభవంబుతోడ భవదాజ్ఞాశక్తి సర్వేశ్వరా.

మ. జలజాతప్రభవాండభాండములు దుశ్చారిత్రులం బాత్రులం
జెలువై యుండ యథాప్రమాణములుగా శిక్షింప రక్షింప ని
శ్చలలీలం బ్రభవించు రాజు భవదాజ్ఞాశక్తిఁగా కింతవ
ట్టెలమిం జేకొని నిర్వహింప మఱి రా జెవ్వండు సర్వేశ్వరా.

జ్ఞానజ్యోతి విజృంభమాణముగ నోజన్ విష్ణువిధ్యాది దే
వానీకాత్మదశావళిం దవిలి నీ వారంగ వారిం గళా
జ్ఞానప్రౌఢులఁ జేయుటన్ వెలయఁగా సర్వజ్ఞశబ్దంబు దా
నీనామాంకముగా విధించు నిగమానీకంబు సర్వేశ్వరా. 11

సురలన్మర్త్యసమూహిగా మనుజులన్ శోభిల్లు బృందారకో
త్కరముంగా ఘను నల్పు నల్పుని ఘనుంగాఁ బుణ్యపాపాళిచేఁ
దిరుగ న్సైచుచు నీమహామహిమ ప్రీతిం బద్మజాండంబునం
దరయన్ జీవుల నింద్రజాలములుగా నాడించు సర్వేశ్వరా. 12

ఘనుఁడై యేచి దశాననుండు బలిమిం గైలాసశైలేంద్ర మె
త్తినఁ దద్దానవనాథుఁ ద్రొక్కి నతఁ డర్థి న్మ్రొక్కినం గాచి ప్రా
క్తనశౌర్యాధికుఁ జేసె దుష్టు నణఁపంగా శిష్టు రక్షింప రం
జనతో నెప్పుడు వేచియుండు భవదాజ్ఞాశక్తి సర్వేశ్వరా. 13

తమకం బెత్తిన నాత్మజం గడు మదాంధవ్యాప్తి నేకాంతప
క్షమునం దెవ్వరుఁ గానకుండఁ గవయంగాఁ బోయి నీబాణఘా
తమునం బద్మభవుండు ద్రెళ్లె ననినం దాఁ దప్ప వర్తించి లో
కమునం దెవ్వరి కింక నిన్ను నెఱుఁగంగా వచ్చు సర్వేశ్వరా. 14

పలుజన్మంబులఁ గూడఁబడ్డ భవశుంభద్ఘోరదుష్కర్మరా
సులపైఁ గూలి సమస్తజీవులు వెసన్ శోషించుచు న్బద్ధదు
ర్బలులై చిక్కినఁ దద్భవాపహరణార్థం బొప్పఁ బద్మోద్భవ
ప్రళయం బొక్కొకమాటు సేయుదు తుదిన్ భావింప సర్వేశ్వరా.

సుమహత్పద్మభవాండపంక్తుల లయక్షోభప్రతాపంబుతో
నిమిషార్థంబునఁ గ్రాఁచి పెంపెసఁగు నీనేత్రానలజ్యోతి య
య్యమమీనాంకజలంధరత్రిపురదైత్యాళి న్విజృంభించి భ
స్మముగాఁ జేయుట నిశ్చయింప నిదిదా శౌర్యంబె సర్వేశ్వరా. 16

మ. అతిదక్షుం డగుదక్షుఁ డీజగములో యాగంబు సల్లక్షణ
స్థితిగాఁ జేయుచునుండి మిమ్ము మదినుద్దేశింపమిం జేసి తా
హతుఁ డయ్యెం దుది నట్టికార్యములఁ బొందై యుండు నే కర్తస
మ్మతితోఁ జేయని దుర్మదుండు మను నే భావింప సర్వేశ్వరా.

మ. జగతీచక్రము పాదఘట్టన నదృశ్యం బై ప్రవర్తింపఁగా
గగనం బంతయు బాహుమండల సమగ్రవ్యాప్తులం దద్భుతం
బుగ ఘూర్ణిల్ల నజాంత్యవేళల సముద్భూతాంగహారావళుల్
నిగుడం బొంగి నటింతు తాండవమహానృత్యంబు సర్వేశ్వరా.

మ. అమరేంద్రాబ్జభవాళి కెన్నఁ దుది నీవాదిం బ్రసాదించి న
ర్థము సిద్ధించుచు నుండుఁగాని సురమాత్రుం గోరిన న్వారికా
ర్యము సిద్ధింప దనేకమార్గములఁ బ్రారంభించిరే నిశ్చయా
ర్థముగా నీవ సమస్తకర్త వగుటం దర్కింప సర్వేశ్వరా.

మ. అమరంగా స్ఫుటభక్తినాటకము భాషాంగక్రియాంగాభిర
మ్యముగాఁ జూపిన మెచ్చి మీరిలబలే యన్నంతకున్ యోనిగే
హములన్ రూపులు వన్నికొంచును నటుండై వచ్చి సంసారరం
గములోనం బహురూపమాడు వెలయంగా జీవి సర్వేశ్వరా.

శా. శ్రీవత్సాంకు రమావిశేషతయు వాక్ఛ్రీనాథుచాతుర్యమున్
దేవాధీశ్వరు వైభవోన్నతియు నాతిగ్మాంశు తేజంబు శ్రీ
దేవీనందనురూపవిభ్రమము చింతింపంగ నీభక్తిస
ద్భావాత్ముం డగుపుణ్యమూర్తికిఁ దృణప్రాయంబు సర్వేశ్వరా.

మ. ఇల సద్భక్తులపాదధూళిపటలం బేమర్త్యు ఫాలంబునం
జిలుకు న్వాఁ డపవర్గనాథుఁ డనిన న్సిద్ధంబుగా వారిని
ర్మలహస్తార్పితభూతిఁ బ్రీతి నొసలారం బూయు విశ్వాసికిన్
ఫల మూహించి విధించి యెవ్వరికిఁ జెప్ప న్వచ్చు సర్వేశ్వరా.

మ. పలుతీర్థంబులఁ గ్రుంకుకంటె మహిలో భక్తాంఘ్రిపానీయముల్
తలమీఁదం జిలికించుకొన్నశుచితీర్థం బాడ భారంబు త
త్ఫల మత్యల్పము భక్తపాదయుగళాంభస్స్పర్శనిర్భర తై
యలరున్ శాశ్వతభుక్తి ముక్తి ఫలదం బైయుండు సర్వేశ్వరా. 23

మ. రమణన్ భక్తసమగ్రదర్శనము తీర్థశ్రేణి, తద్గోష్ఠి తీ
ర్థము, తద్దివ్యదయావలోకనము తీర్థం బెన్నఁగా నిట్టి జం
గమతీర్థాంబుధి నోలలాడక వివేకభ్రష్టు లై పోయి లో
కములోఁ దీర్థములంచు నేఱులు సొఱంగా నేల సర్వేశ్వరా. 24

మ. కమనీయం బగుసర్వతీర్థములు లింగం బున్నచో మూర్తిమం
తము లై యొప్పుచునుండు లింగమును దాత్పర్యంబుతో భక్తగా
త్రములం దెప్పుడు నుండుఁగాన మహిలోఁ దత్త్వార్థమూహింపఁ దీ
ర్థములం దెల్లను దివ్యతీర్థము భవద్భక్తుండు సర్వేశ్వరా. 25

మ. ధరణిం దీర్థము లాడుకంటె నతిమోదం బొప్ప యజ్ఞంబులం
బరఁగం జేయుటకంటె సువ్రతము లొప్పన్ వేదశాస్త్రార్థత
త్పరుఁ డై యాదటఁ జల్పుకంటె మది నుత్సాహించి నీభక్తిమ
త్పురుషశ్రేష్ఠులఁ బూజసేయుట మహాపుణ్యంబు సర్వేశ్వరా. 26

మ. భవదీయామలతత్త్వనిర్ణయకళాప్రఖ్యాతసద్భక్తపుం
గవగోష్ఠీ సుఖవార్ధిలోనఁ గడువేడ్కం దేలినం గాక యీ
భువిలోఁ దీర్థజలంబులం గడిగినం బోనేర్చునే ఘోరదు
ర్భవసంఘాకలితాత్మతామసమహాపంకంబు సర్వేశ్వరా. 27

మ. ధరణిం బ్రాక్తనభక్తనిర్మితమహాస్థానంబు లై యొప్పు శ్రీ
గిరిముఖ్యం బగు దివ్యతీర్థములు భక్తిం జూచిరే వారిదు
స్తరదోషంబులు వాయునన్న మతిసాక్షాద్భక్తులం జూచినం
బరమార్థంబుగఁ బాయదే నరులపాపం బెల్ల సర్వేశ్వరా. 23

మ. కని సద్భక్తుల కంత నంతఁ గడువేడ్కన్ హృత్ప్రణామంబు సే
సినమాత్రం జెడు సర్వదోషములు తచ్ఛ్రీపాదము ల్మట్టి మ్రొ
క్కిన సర్వాంగసమగ్రశుద్ధి యగుభక్తిన్ వారికిం బ్రీతిచే
సినఁ ద్వద్దివ్యదయావలోకనఘనశ్రీలొందు సర్వేశ్వరా. 29

మ. జలజాతప్రభవాచ్యుతాదులు మదిం జర్చించి చర్చించి నీ
కలరూ పారయ లేక చిక్కులఁ బడంగా నిన్ను హస్తార్పితా
మలకవ్యాప్తికిఁ దెచ్చి యేర్పఱిచి సంబంధించి చేకొన్న భ
క్తులశౌర్యం బుపమింప నెవ్వఁడు సమర్థుం డింక సర్వేశ్వరా. 30

మ. అమరన్ భక్తగణాత్మమధ్యమము లింగావాస మాలింగమ
ధ్యమముం బద్మభవాండభాండనిలయం బై యుండుటన్ భక్తతృ
ప్తి మహాలింగము తృప్తి యై మహిమ నుద్దీపించుఁ దల్లింగతృ
ప్తిమహత్త్వంబున నీసమస్తమును దృప్తిం బొందు సర్వేశ్వరా. 31

మ. అనురాగంబున నిన్నుఁ జూచుఁ దలపోయుం జొక్కుఁ గాంక్షించు వ
ర్ణనసేయం దమకించు సిగ్గు విరియుం బ్రార్థించు శోషించు నం
త నిదిధ్యాసము దాల్చుఁ దన్ను మఱచుం దానిదశావస్థలం
దనరంగా మది నిన్నుఁ దక్కఁ గొను సద్భక్తుండు సర్వేశ్వరా. 32

మ. ఎలమిన్ భక్తుఁడు వక్రుఁ డై నడిచెనే నేపారఁగా దానికిం
గలుషింపం గలహింపఁ గింకిరిపడంగా దెట్టిచో నైన ని
ర్మలగంగాపృథులప్రవాహ మరయం బ్రస్ఫూర్తిఁ బా ఱెన్నివం
కలుగాఁ బాఱిన దాని నొండు వలుకంగాఁ జన్నె సర్వేశ్వరా. 33

మ. సికతాధామము నీకుఁ జేసి మదిలోఁ జెన్నొంది క్రీడించు బా
లకు లింద్రాధిపు లన్న నీగుడు లతిశ్లాఘ్యేష్టకాస్థాదులన్
సుకుమారంబుగ నెత్తి భూతలములో శోభిల్లువంశప్రదీ
పకు సౌభాగ్యము మాన మెవ్వరికిఁ జెప్ప న్వచ్చు సర్వేశ్వరా. 34

మ. భవదభ్యర్చనవేళలన్ భవుల సంపద్భ్రాంతులన్ దీనమా
నవులన్ విద్విషులన్ భవాతురుల సన్మానించుటల్ సౌఖ్యమా
ఖ్యవిహారేచ్ఛలు నీమహత్త్వములు నిత్యానంద మూహించుచో
భువి నీభక్తుల కాత్మలో విరసము ల్పుట్టించు సర్వేశ్వరా. 35

మ. కరుణం జేకొనిరేని. కౌరవపదగ్రస్తాత్ము దేవేంద్రుఁగాఁ
బరఁగం జేయుదు రాత్మలో నలిగిరేఁ బర్జన్యునా కౌరవో
త్కరపంకప్రవిలీనకీటకముఁగాఁ గల్పింతు రన్నట్టిచో
నరయన్ భక్తులశక్తి యెట్లు గుఱిసేయ న్వచ్చు సర్వేశ్వరా. 36

మ. రమణీయక్షితిపాలుఁ డింద్రుని చతుర్మాసక్రమాయుష్యుఁ డా
యమరేంద్రుం డజునాడికాద్వయమువాఁడా బ్రహ్మ యుష్మన్నిమే
షమువాఁ డంచును వీరి నెల్ల నగు నీసాలోక్యసామీప్యస
త్తమరాజ్యస్థితిపట్టభద్రుఁ డగుసద్భక్తుండు సర్వేశ్వరా. 37

మ. ప్రకటింపంగ సమస్తపాతకములం బాపంగ నీపూజయుం
దొకపుష్పాంశము చాలు నన్న మహిలో నూహింపఁగా నీపదా
ర్చకు లేమార్గమునందు శుద్ధులు మదిం జర్చింపఁ దద్దుర్గుణ
ప్రకరం బెన్నెడివాఁడు లోకములలోఁ బాపిష్ఠి సర్వేశ్వరా. 38

మ. తమతేజంబుఁ దృణీకరించుచు సముద్యత్తేజులై మీఁదిలో
కములందున్ జరియించు నీయచలభక్తశ్రేష్ఠులం జూచి నె
య్యమునం దారును దద్విధంబునను ని న్నర్చింప నూహించి మ
ర్త్యమునం బుట్టఁగ వాంఛ సేయుదు రమర్త్యశ్రేణి సర్వేశ్వరా. 39

మ. అమరన్ భక్తుల కెల్ల నీవ హృదయం బై యుండుట న్వారి సౌ
ఖ్యము నీసౌఖ్యము వారికూర్మియు సమగ్రం బైననీకూర్మి త
త్త్వము భావింపఁగ వారికోపము భవత్ప్రఖ్యాతరౌద్రప్రభా
వము దా వారలవాక్యనిర్ణయము నీవాక్యంబు సర్వేశ్వరా. 40

మ. అవనిం బెన్నిధి భాగ్యహీనునకుఁ బ్రత్యక్షంబుగా కప్పు డొం
డవ భాండాకృతిఁ దాల్చి మాటువడి మాయావృత్తి నున్నట్లు దా
భవదీయప్రతిబింబమూర్తి యగుసద్భక్తుండు సంసారదు
ర్వ్యవయసాయాత్ముల కెల్లఁ గేవలనరుండై తోఁచు సర్వేశ్వరా. 41

మ. క్షితిపై శ్వేతమునీంద్రుఁ జంప నలుకం గీనాశుఁ డేతెంచి నీ
యతికోపోజ్జ్వలనాహుతి న్మడిసెఁ దథ్యం బేకనిష్ఠాసమ
న్వితులం జేకొని భక్తవత్సలుఁడ వై నీ వెప్పుడు న్గావఁగాఁ
బ్రతిపక్షావలి కెట్లు వారిదెసఁ జేర న్వచ్చు సర్వేశ్వరా. 42

శా. కింకం దన్ను నదల్చి చక్రమునఁ దాఁ గృష్ణుం డని న్వైచినం
బొంకం బొప్పఁగ దానిఁ దుత్తుఱుముగాఁ బోఁదట్టి యుప్పొంగె ని
శ్శంకాత్ముండు దధీచి శాశ్వతులు నీసద్భక్తు లూహింపఁగా
సంకల్పప్రభవప్రతాపవనభాస్వద్దావ సర్వేశ్వరా. 43

మ. ఘటదుగ్ధంబులు పేరుఁ గాక వెలయంగా నెంత తోడంటి న
న్నటదుగ్ధాంబుధి పేరనే జగములో నల్పుండు దుస్సంగతిం
జటులాత్ముం డగుఁగాక యెయ్యెడల నీసద్భక్తుఁ డేకార్య ము
త్కటమై తాఁకిన నవ్యచిత్తుఁ డగునే తర్కింప సర్వేశ్వరా. 44

మ. సతివేడ్కం దనప్రాణవల్లభునితో సంయోగ మర్థించుఁగా
కతనిం బ్రార్థనసేసి సొమ్ము గొనిపో నఱ్ఱాడునే భక్తుఁ డీ
క్షితి నీభక్తియ వేఁడుఁ గాక మఱి నీశ్రీపాదము ల్గొల్చి కు
చ్చితకామ్యార్థము లొండు వేఁడుకొనునే చింతింప సర్వేశ్వరా. 45

మ. భ్రమరధ్యానము దాల్చి కీటకము సద్భావాదిసంయుక్తిఁ దా
భ్రమరం బై ఖగవీథి నాడు ననిన న్బాటించి నిన్నాత్మ నె
య్యముతో ధ్యానము సేయుమర్త్యుఁడును నీయట్లే పరవ్యోమత
త్త్వమునం దవ్యయలీల నుండు టరుదే భావింప సర్వేశ్వరా. 46

మ. అమరశ్రేణులకు న్సుధామయకళౌఘాత్మీయసారంబు ర
మ్యముగాఁ గ్రోలఁగ నిచ్చి తా నొకకళామాత్రాంగుఁడై యున్నచం
ద్రమునిం జూచి జగమ్ము మ్రొక్కు గతినారన్ భక్తపూజావిధి
క్రమభారాకృశుఁ జూచి మ్రొక్కుదురు లోకం బెల్ల సర్వేశ్వరా. 47

మ. చెదరం బాఱు దశప్రభంజనములన్ శిక్షన్ సుషుమ్నంబునం
గుదియం బట్టి చలింపకుండ శశి నర్కుం గట్టి భాస్వన్మన
స్సదనస్థానమునందు నిస్నైలమి సంస్థాప్యంబు గాఁజేసి తా
హృదయానందరసాబ్ధిఁ దేలు శివయోగీంద్రుండు సర్వేశ్వరా. 48

మ. వెలి వీక్షించిన నీస్వరూపమె మహావిస్పష్టమై యాత్మలో
పల భావించిన నీస్వరూపమె మహాప్రవ్యక్తమై దృష్టులం
దలఁపం జేకొని యున్న నీయచలితధ్యానంబునం జేసి తాఁ
గలనైన న్శివయోగి తన్ను జగముం గానండు సర్వేశ్వరా. 49

మ. భవదాకారమె కాంచు నీ స్తవకదంబశ్రేష్ఠసద్వాక్యముల్
చెవులార న్విను నిన్నె చెప్పు మది దుశ్శీలేంద్రియాటోపదు
ర్వ్యవసాయాత్ములఁ గాంచుచో వినెడిచో వర్ణించుచోఁ జీఁకునుం
జెవిటి న్మూఁగయునై చరించు మహి నీశీలుండు సర్వేశ్వరా. 50

మ. అతిలాలిత్యముగా నహర్నిశము నిన్నర్చింపఁగావచ్చు సు
వ్రతుఁడై యుండఁగవచ్చు నెల్లకళలం బ్రౌఢుండు గావచ్చు వా
క్పతి గానైనను వచ్చుఁగాని మఱి నీభక్తుండు గారాదు సు
స్థితిగా నీదయలేనిమానవునకుం జింతింప సర్వేశ్వరా. 51

మ. భవికిన్ భక్తి మహత్త్వ మంకురితమై పాటిల్ల భక్తుండు బాం
ధవమాత్రుం డగుభక్తి పుష్పితముగాఁ దద్భక్తుఁ డాత్మేశుఁడై
సవిశేషస్థితిఁ దోఁచు భక్తిసఫలోత్సాహంబునుం బొందఁగా
నవికల్పస్థితి నంత భక్తుఁడును నీవై యుండు సర్వేశ్వరా. 52

మ. సుముఖుండై శివయోగి మోదము మదిన్ శోభిల్లఁ జేకొన్న భి
క్షము విప్రోత్తమకోటిభోజనసదృక్షం బన్న సౌభాగ్యయో
గమునం దారయ నమ్మహామహుఁడు వేడ్కం గోరి యారోగిణం
బమరం జేసినపుణ్య మెట్లు గుణిసేయ న్వచ్చు సర్వేశ్వరా. 53

శా. ఎచ్చో నీపదభక్తుఁ డుండు మది నింపెక్కం బ్రయత్నంబుతో
నచ్చో నీ వనిశంబు నుండుదు త్వదీయధ్యానచిన్మూర్తులై
యచ్చో సన్మును లెల్ల నుండుదురు మంత్రాంగాక్షరాయుక్తులై
యచ్చోఁ దీర్థము లెల్ల నుండు నిది వేదార్థంబు సర్వేశ్వరా. 54

శా. సత్యం బెప్పుడుఁ దప్పఁడేనియు దురాచారుండు గాఁడేని యౌ
చిత్యం బేమఱఁడేని దుర్జనులగోష్ఠిం బొందఁడే భక్తసాం
గత్యం బాదటఁ బాయఁడేని మదనగ్రస్తుండు గాఁడేని నీ
భృత్యుం డాతఁడు మూఁడులోకములలోఁ బెంపొందు సర్వేశ్వరా.

శా. పెంపం దల్లియగున్ రుజాపటలదుష్పీడావిధిక్షోభ వా
రింపన్ వైద్యుఁ డగుం గుమార్గవిధులం గ్రీడింపఁ బోకుండ శి
క్షింపన్ బల్లిదుఁ డైనతండ్రి యగుచున్ శ్రీమంతుఁగా నెంతయున్
సంపద్వృద్ధి యొనర్ప దాత యగు నీసద్భక్తి సర్వేశ్వరా. 5

మ. ఉరుసంసారగజేంద్రదర్పదళనవ్యాఘ్రప్రతాపోగ్రకే
సరి దుష్పాపశరీరబంధవిపులస్తోమజవ్రజచ్ఛేదవి
స్ఫురితక్రూరకుఠారధార దురితప్రోద్భూతజీమూతదు
స్తరసంఘాతవిఘాతమారుతము నీసద్భక్తి సర్వేశ్వరా. 5

మ. అరివీరప్రకరంబు భీకరతరంబై తాఁకుచో సింహసిం
ధురశార్దూలమృగోరగాది భయము ల్దోతెంచుచో ఘోర(రోగ)దు
స్తరసంసారవికారవేదనలు మీఁదం బర్వుచో వజ్రపం
జరమై చేకొని తన్ను నెత్తుకొను నీసద్భక్తి సర్వేశ్వరా.

మ. కమలాప్తుం డుదయింపఁగా నవలనక్షత్రక్షపాధీశ తే
జము లెల్లం బెడఁబాసి పోవుగతి నీసద్భక్తిభావంబు చి
త్తములోనం బ్రభవింపఁగా నితరమంత్రధ్యాన తద్దేవతా
క్రమమాయాపటలంబు లన్నియును వీఁకంగ్రాఁగు సర్వేశ్వరా. 59

మ. చటులప్రాయగు జేంద్రియాత్ములకు వాంఛావృత్తి నీభక్తిసం
స్ఫుటమై యుండదు భక్తితత్పరులకుం బోల్పొందఁగాఁ జిత్తము
త్కటదుష్టేంద్రియవర్గతామసపరిగ్రస్తంబుగా నెట్లు చీఁ
కటికిం దిగ్మమరీచికిం గలదె సాంగత్యంబు సర్వేశ్వరా. 60

మ. బలవంతుండును దుర్బలుండును మహాప్రౌఢుండు మూఢుండునుం
గులహీనాత్మకుఁడుం మహాకులజుఁడుం గ్రూరుండు శాంతాతిని
శ్చలచిత్తుండును నొక్కరూప మది నీసద్భక్తిచిత్తంబులో
పల వర్ధిల్లిన మీఁద నేవిధమునం భావింప సర్వేశ్వరా. 61

శా. కామోద్రేకవిజృంభణంబును సమగ్రక్రోధముం లోభముం
వ్యామోహంబు మదంబు మచ్చరము దీవ్రం బైనపంచేంద్రియో
ద్దామాటోపము గ్రాఁచి పెంపెసఁగు తత్త్వజ్ఞానికిం గాక తా
సామాన్యాత్ములకేల నూలుకొను నీసద్భక్తి సర్వేశ్వరా. 62

మ. ఉరుపక్షంబులు వచ్చునంతకు నిరుద్యోగంబున న్వృక్షకో
టరమధ్యంబున నుండుపక్షిగతి నిష్ఠం గూరి(డి) నీభక్తి వి
స్తరమాత్మం బ్రభవించునంతకును నీసంసారకారాగృహాం
తరగేహంబున నుండి జీవుఁ డతివంతం బొందు సర్వేశ్వరా. 63

శా. లింగారాధన జంగమార్చనము లోలిం భక్తి కంగంబు ప్రా
ణాంగవ్యాప్తియునై స్ఫురించు నిది తత్త్వార్థం బగుం గాన నా
యంగాభ్యర్చన జంగమాహితకరుం డై చేసినం దాళవ
శృంగారం బగు వానిభక్తి మదిఁ జర్చింపంగ సర్వేశ్వరా. 64

మ. ధరణిం గర్మవిధానభక్తి విభవధ్యానోత్తమజ్ఞానముల్
వరుసం జేర్కొన నాల్గుయోగములు తత్త్వం బెందు నీభక్తి వి
స్తరబాహ్యక్రియ లెల్లఁ బొల్లు లగుటం దద్భక్తియోగంబు తాఁ
బరఁగం దక్కిన మూఁడుయోగములకుం బ్రాణంబు సర్వేశ్వరా. 65

మ. అమరంగా ధన మిచ్చి కాతురు మహీయఃప్రీతిఁ బ్రాణంబుఁ బ్రా
ణము నర్థంబును నిచ్చి కాతు రభిమానంబు న్విశేషించి మా
నముఁ బ్రాణంబును నర్థము న్నొసఁగి సన్మానంబుగా నుత్తమో
త్తమచారిత్రులు భక్తిఁ గాతురు ప్రమోదం బంది సర్వేశ్వరా. 66

మ. అనుబద్ధేంద్రియభూతవర్గము యమాద్యష్టాంగమంత్రోరుసా
ధన నుచ్చాటనసేసి పాపి గురుసద్వాక్యప్రకాశోత్తమాం
జనదృష్టిం బరికించి యేర్పఱిచి వాంఛం గోరి సాధించి చే
కొను చిన్మాత్రికిఁ గాని భక్తినిధి గీల్కొనెందు సర్వేశ్వరా. 67

మ. కనకం బందు ఘనీభవించిన కళంకం బెల్ల సుశ్యక్తిగా
ననలాస్యంబునఁ గ్రాఁగిపోవుగతి జీవాత్మం బ్రవేశించి చే
కొని వర్తించిన దుశ్మలత్రయపరిక్షోభంబు నీభక్తిచే
తను బాపంబడుఁ గాని వేఱొకటిచేతం బోదు సర్వేశ్వరా. 68

మ. అమరంగా గురుమంత్రకార్ముకమునం దాత్మాస్త్ర మష్టాంగయో
గమహాముష్టివివేకి తేయుటయుఁ దత్కాండం బజాండాదిత
త్త్వము లెల్ల న్వడి గ్రుచ్చి పాఱి భవదుద్యత్తూస్తత్క్షైవల్యల
క్ష్యమునం దద్భుతశక్తితోడఁ గమియంగా నాటు సర్వేశ్వరా. 69

మ. తనరం గాయపవిత్రమందు హృదయస్తంభాభిసంస్థానమై
చను నీధ్యానపటంబు నూల్కొలిపి భాస్వద్భక్తివాతాహతి
న్వినుతజ్ఞానపథంబు చేకొని సముద్వేగంబునన్ జీవుఁ డీ
ఘనసంసారమహార్ణవంబుఁ గడవంగాఁ బాఱు సర్వేశ్వరా.

మ. అక్షలంకస్థిరభక్తిమ నొప్పగయ నిన్నశ్రాంతముం జూచి పా
యక పూజించు మహామహుండు భవదభ్యర్చ్యుండగుంగాక దా
సకలేచ్ఛావిషయంబులం బొరయుచుం జాపల్యతం జేయు నా
బకవేషార్చన లేల నిన్ను సొగయింపం జాలు సర్వేశ్వరా. 71

మ. సమదో(రో)త్సాహసుఖాభిలాషలును నీసంసారమాయావినో
దములు న్స్వర్గఫలాపవర్గఫలచిత్తభ్రాంతులుం బ్రాజ్యరా
జ్యమహాకాంక్షలు నెన్నిచూడ నివి నీసద్భక్తి కత్యంతరా
యములై మాటికి మాటికడ్డుపడుఁ గామ్యశ్రేణి సర్వేశ్వరా. 72

శా. మోహధ్వాంతములో మునింగినమహామూఢుం డతిభ్రష్టుఁడై
సోహం బంచుఁ దొడంగి నీకుఁ గడు దూరాత్ముం డగుంగాని దు
ష్టాహంకారగుణంబు మాని మది సొంపారంగ సద్భక్తి దా
సోహం బన్న భవత్పదార్చకుఁడు నీవై యుండు సర్వేశ్వరా. 73

శా. చావం బుట్టుచుఁ బుట్టఁ జచ్చుచు మహాచండాలసంసారపా
రావారంబునఁ గూలి తాఁ జెడుటకుం బ్రవ్యక్తిగా నాత్మలో
నేవం బొందక యేను నీ వనుట తా నేజ్ఞానమో శ్రీమహా
దేవా యిట్టికుతర్కముం గలదె చింతింపంగ సర్వేశ్వరా. 74

మ. రసికుండై భవదంఘ్రిపద్మయుగ మారాధించుచో దుర్మద
వ్యసనాటోపము చిక్కులం బొరయుచు న్వర్తించుచున్నట్టిపా
లసుపూజావిభవం బదొప్పునె మహిన్ లక్షింప నారంభముం
గసవుం బెంచినచేనియట్లుఁ దలఁపంగా మీఁద సర్వేశ్వరా. 75

మ. అమితోత్సాహము నంది నీకుఁ దనసర్వార్థంబులుం గూర్చి నే
మముతో నిచ్చుటకంటె శౌర్యగుణసామర్థ్యంబునం జేసి ప్రా
ణము నీ కిచ్చుటకంటె దుస్తరభవోన్మాదంబు మర్దించి చి
త్తము నీ కిచ్చుట పెక్కుభంగుల మహౌదార్యంబు సర్వేశ్వరా. 76

మ. ఘనవైరిప్రకరంబుఁ దాఁకి యనిలోఁ ఖండించుకంటెన్ మృగేం
ద్రుని జేపట్టుటకంటె దిగ్గజముతోఁ ద్రోపాడుకంటెన్ మహా
శనిఁ దాఁ ద్రేయుటకంటె ఘోరభవదుశ్చారిత్ర వారించి రం
జనతోఁ జిత్తము శిక్ష సేయుట మహాశౌర్యంబు సర్వేశ్వరా. 77

మ. అమితామోదనవప్రసూనముల నిన్నర్చించుచోఁ గద్యప
ద్యము లూహించి నుతించుచోఁ వివిధగీతవ్రాతము ల్పాడుచోఁ
నమృతాహారము లిచ్చుచోఁ నిపుణుఁడై యాటాడుచోఁ నందుఁ జి
త్తము సద్భక్తియె నీవు చేకొనుపదార్థంబెల్ల సర్వేశ్వరా. 7

మ. కడుఁ జిత్రంబుగఁ జేయఁగా నొఱ సురంగం బయ్యెనే ఖడ్గమం
దిడకున్నం జెడురూ పదేమికొఱ దానిం జెక్కు పాటింపఁగా
నొడ లెబ్బంగులనోపునే నియతితో నూహించి నిన్నాత్మలో
నిడకున్నం జనురూపు నేమికొఱ తా నీక్షింప సర్వేశ్వరా.

మ. జ్వరసంతాపవిశోషితాంగుఁడు సుధాసంకాశదివ్యాన్నపా
నరసశ్రేణి భుజింప రోయుఁగతి నున్మాదేంద్రియధ్వాంతదు
స్తరసంసారమదప్రమత్తుఁడు మహాసౌఖ్యోత్సవంబైన మీ
చరణారాధనయందు బుద్ధిఁ జొనుపం జాలండు సర్వేశ్వరా.

మ. కలయం గాష్ఠయుగంబుఁ గూర్చి తరువంగాఁ బుట్టి తత్సాధనం
బుల రెంటిన్ దహియించువహ్నిగతిఁ దాఁ బొల్పొందఁ గాయంబు
ధిల సత్కర్మముతో మథింపఁగ భవచ్ఛిద్భక్తి సద్వహ్ని యు
జ్జ్వలమై కాయముఁ గర్మముం జెఱుచుఁ దత్త్వం బెన్న సర్వేశ్వర

మ. స్థిరబుద్ధిం దనసొమ్ము భక్తవరసుక్షేత్రంబునన్ బీజమై
పరఁగంగా వెదపెట్టి మీఁద నతిసంపన్నుం డగుంగాక దా
నరిషడ్వర్గముపాలు సేసి భవమాయాగ్రస్తుఁడై ఱుచ్చ నె
వ్వరి వేఁడం జనువాఁడొకో విషయదుర్వ్యాపారి సర్వేశ్వరా.

శా. కాయం బన్నది వారిబుద్బుదసదృక్షం బందు రూపింప లేఁ
బ్రాయం బన్నది శారదాంబుదతటిత్ప్రాయంబు సంపత్సుఖ
శ్రేయం బన్నది మాయ యిట్లెఱిఁగియున్ శీఘ్రించె నీధ్యానసం
స్థాయీభావనఁ బొందఁ డేమిటికయో సంసారి సర్వేశ్వరా. 83

మ. భవదీయస్థిరభక్తిలబ్ధియు భవద్భక్తైకగోష్ఠీమహో
త్సవలీలావిభవంబు నీయచలితధ్యానానుమోదంబు లౌ
నివి నిత్యస్థితు లారయంగ విధి దేవేంద్రాదిభూతాఖిలో
త్సవభోగస్థితు లెల్ల మిథ్య లవి తత్త్వం బెన్న సర్వేశ్వరా. 84

మ. తనయుక్తిన్ భవదంఘ్రిపంకరుహసద్భక్తుండు పాపంబుచే
సినఁ బుణ్యం బగు భక్తిహీనుఁడు శ్రుతుల్ చేపట్టి పుణ్యంబుచే
సినఁ బాపం బగు దీని కింతయును జర్చింపంగఁ జండీశ్వరుం
డును దక్షుండును సాక్షు లెన్న నగరాట్కోదండ సర్వేశ్వరా. 85

శా. ప్రారంభించి చకోరపోతము మహీయజ్యోత్స్నయం దుత్సవ
శ్రీరంజిల్లుచు సోలుచుండుగతి నాచిత్తంబు నీదివ్యశృం
గారధ్యానమునం దహర్నిశముఁ జొక్కం జేయవే దేవ శ్రీ
గౌరీలోచననర్తకీనటనరంగస్థాన సర్వేశ్వరా. 86

మ. తరులం బువ్వులు పిందెలై యొదవి తత్తజ్జాతితోఁ బండ్లగున్
హర మీపాదపయోజపూజితములై యత్యద్భుతం బవ్విరుల్
కరులౌ నశ్వములౌ నవర్ఘమణులౌఁ గర్పూరమౌ హారమౌఁ
దరుణీరత్నములౌఁ బటీరతరులౌఁ దథ్యంబు సర్వేశ్వరా. 87

మ. ఒకపుష్పంబు భవత్పదద్వయముపై నొప్పంగ సద్భక్తిరం
జకుఁడై పెట్టిన పుణ్యమూర్తికిఁ బునర్జన్మంబు లే దన్నఁ బా
యక కాలత్రితయోపచారముల నిన్నర్చించుచుం బెద్దనై
ష్ఠికుఁడై యుండెడువాఁడు నీ వగుట దాఁ జిత్రంబె సర్వేశ్వరా. 88

శా. ఆనందంబును బొందినప్పుడును న(స్నానాచారచర్యాది) త్యాశ్చర్యకా
వాసీకంబులు దోఁచునప్పుడును రోగాపాయదుఃఖాతుర [ర్యార్థభా
గ్లానింబొంది చరించునప్పుడును సత్కార్యంబున న్నీవు నా
ధ్యానంబం దుదయింపుమయ్య దివిజేంద్రస్తుత్య సర్వేశ్వరా. 89

శా. నానాశాస్త్రసముచ్చయాగమపురాణప్రౌఢులై తత్త్వవి
జ్ఞానధ్యానసమాధివిద్యలతివిస్పష్టంబుగా నేర్చిరే
దా నీనేర్పుల నెల్లనొప్పదు భవత్సద్భక్తివిద్యాసమా
ధానప్రస్ఫుటశక్తి నీకరుణచేతంగాని సర్వేశ్వరా. 90

మ. ప్రకటింపంగ మదీయచిత్తమది దాఁ బంచేంద్రియోద్వృత్తమై
ప్రకటప్రాప్తిని సోలుఁగాని మఱి నీపాదాబ్జసంసేవనం
బొకవేళన్ భజియింప నొల్లదు నిజం బూహింప నెట్లన్న నీఁ
గకు దుర్గంధముగాక సహ్యమగునే కస్తూరి సర్వేశ్వరా. 91

మ. మలినాంగుం డగుఁ జేమికష్టము మనోమార్గంబు నీభక్తిని
ర్మలసౌభాగ్యనిధానదీపశిఖయై రంజిల్లదే భూషణో
జ్జ్వలదేహుం డగుఁ జేమి తేజము మనోవ్యావృత్తి దుర్మోహచం
చలదుష్కర్మతమంబు వీడఁబడునే చర్చింప సర్వేశ్వరా. 92

మ. ఇల నాచిత్తము యోగసాధనలయం దీఁదాడఁగాఁ గొంతని
శ్చలతం జేరఁగవచ్చు లేక తనవాంఛావృత్తిఁ బోనిచ్చినం
బలుపై నాజెసఁ జేర దట్టి దకటా భావించినంగాక కే
వలసంబోధన నేల నిల్చు బుజువై వర్తిల్లి సర్వేశ్వరా. 93

మ. ఉదకం బింకిన లావు దూలివడిఁ దా నుష్ణింపఁగా రొంపిలోఁ
గదలంజాలని మీను వానగురియం గ్రమ్మెక్కి పెన్నీటిలోఁ
బొదలం గన్నవిధంబునన్ భవముతోఁ బోరాడుమర్త్యుండు దా
హృదయాబ్జంబున నిన్ను నిల్పఁగనునే యింపొంద సర్వేశ్వరా. 94

మ. భవదీయార్చన సేయుచోఁ బ్రథమపుష్పం బెన్న సత్యంబు రెం
డవపుష్పంబు దయాగుణం బతి విశిష్టం బేకనిష్ఠాసమో
త్సవసంపత్తి తృతీయపుష్ప మది భాస్వద్భక్తి సంయుక్తి యో
గవిధానం బవి లేనిపూజలు మహిం గైకోవు సర్వేశ్వరా. 95

మ. అమరేంద్రాద్రి శరాసనంబు హరి దివ్యాస్త్రంబు భూమండలం
బమరంగా రథ మర్కచంద్రులు తదీయాంగంబులై యొప్పఁ జి
త్రమె నీకుం బురలక్ష్య మేయు నెడ సుద్యద్భాతి నత్యల్పకా
ర్యములం దైనను దా మహాఘనము నీయత్నంబు సర్వేశ్వరా. 96

మ. దివిజేంద్రత్వముఁ బద్మజత్వము జగత్సేవ్యస్థిరానర్గళో
త్సవరూపం బగు కేశవత్వమును నీసద్భక్తి సంవృద్ధిలో
లవమాత్రస్థితు లెన్న భక్తిజనితోల్లాసావనోద్యత్సుఖా
ర్ణవసౌభాగ్యపుమాన మెవ్వరికి జెప్ప న్వచ్చు సర్వేశ్వరా. 97

మ. పరమార్థంబుగ నామనంబున భవద్భక్తిప్రభావంబు వి
స్తరమై పుట్టదు పుట్టినం బ్రబల దంతం గొంతవర్ధిల్లెనే
విరసంబై యటమీఁదఁ జిక్కువడుఁ దా వేవేగ నెట్లన్న న
స్థిరుఁడంగాన జడుండఁగాన బకవేషింగాన సర్వేశ్వరా. 98

శా. శ్రీకంఠాయ నమోనమో నతసురజ్యేష్ఠాయ రుద్రాయ లిం
గాకారాయ నమోనమో విగతసంసారాయ తారార్కచం
ద్రాకల్పాయ నమోనమో దురితసంహారాయ తే యంచు ని
న్నాకాంక్షం బఠియించుమానవుఁడు నీవై యుండు సర్వేశ్వరా. 99

మ. భువనోత్పత్తి విధించుచో భవుఁడవై పాల్పొందఁగా దాని ను
త్సవలీలం బ్రభవించుచో మృడుఁడవై సర్వంబుఁ గల్పాంతభై
రవసంక్షోభ నటించుచో హరుఁడవై త్రైగుణ్యశక్తిం దుదిన్
శివనామాంకముఁ దాల్చు నీమహిమ దాఁ జిత్రంబు సర్వేశ్వరా. 100

మ. కులశైలంబులు పాదుపెల్లగిలి దిక్కూలంబునం గూలినం
జలధు ల్మేరల నాక్రమించి సముదంచద్భంగి నుప్పొంగినన్
జలజాతప్రియశీతభానులు యథాసంచారము ల్దప్పినం
దలఁకం డుబ్బఁడు చొప్పుఁ దప్పఁడు భవద్భక్తుండు సర్వేశ్వరా. 101

శా. శూలస్థాపితుఁ డైనమానవునకున్ శూలంబు దుర్వారవా
త్యాలిం కంపము నొందకుండుట సుఖంబై తోఁచుమాడ్కిన్ భవా
భీలజ్వాలలఁ గ్రాఁగుమానవునకున్ బింబాధరల్ హారవ
స్త్రాలంకారము లించుకించుక సుఖంబై తోఁచు సర్వేశ్వరా. 102

శా. ఆకాశానలచంద్రసూర్యపవమానాత్మాంబువిశ్వంభరా
ప్రాకామ్యాంచితమూర్తిభేదముల నీబ్రహ్మాండనానాఘటా
కనిప్రాకటజీవభావవిలసన్నిర్మాణకర్మాద్భుతా
స్తోకశ్రీకరమూర్తి యై నెగడు నీస్థూలంబు సర్వేశ్వరా. 103

మ. అతివాఙ్మానసమై యజాండనిలయంబై యాదిమధ్యాంతవ [త్మసం
ర్జితమై నిర్గుణనిష్కళంకపదమై (శీలోత్తమాధ్యాత్మ)సిద్ధాంత మధ్యా
యుతమై కోటిరవిప్రకాశయుతమై యోంకారమంత్రాదిసం
స్తుతమై యెంచ నచింత్యమై వెలుఁగు నీసూక్ష్మంబు సర్వేశ్వరా. 104

మ. అజుఁడై సృష్టియొనర్చు రాజసమునం దండంబుగాఁ దా నధో
క్షజుఁడై వర్ధిలఁజేయు సాత్త్వికము సంప్రవ్యక్తిగా గోపతి
ధ్వజుఁడై సంహృతిసేయుఁ దామసమునం దత్సర్వముం గూడఁగా
నిజవిస్ఫూర్తి వెలుంగుఁ దుర్వ్య మగుచున్ నీయాజ్ఞ సర్వేశ్వరా. 105

మ. సకలాధీశ్వరపట్టభద్రుఁడవు భిక్షాగామి వత్యంతశాం
తకళాత్ముండవు రౌద్రమూర్తి వతిసౌందర్యాంబికాసంగమా
ధికలోలుండవు దివ్యయోగివి మదిం దెల్లంబుగా నెట్టివా
రికిఁ దా శక్యమె నీనిజం బరసి చర్చింపంగ సర్వేశ్వరా. 106

మ. భవదుఃఖార్ణవయానపాత్రము పరబ్రహ్మంబు యోగీంద్రహృ
ద్భవనప్రస్ఫురితప్రదీపము లయధ్వాంతార్కబింబం బలి
శ్రవణానందకరంబు సన్మునిగణస్వాధ్యాయసారంబు మీ
శివనామాంకము భక్తపుంగవసదాసేవ్యంబు సర్వేశ్వరా. 107

మ. అణిమాద్యష్టగుణప్రసిద్ధులు త్రిలోకారాధ్యు లుద్యద్వచో
మణికోటిప్రతిమప్రభాపటలు లున్మాదేంద్రియధ్వాంతభీ
షణదైత్యేంద్రవినాశకారణమహాశౌర్యోన్నతు ల్లోకర
క్షణదక్షుల్ వినుతింప నీప్రమథసంఘాతంబు సర్వేశ్వరా. 108

మ. సకలాధీశ్వరులై గణాధిపతులై సర్వజ్ఞులై నిత్యులై
యకలంకాత్మకులై మహామహిములై యంభోజగర్భాండర
క్షకులై యుండుదు రెల్లవారును భవత్సద్భక్తి నానాగణా
ధికలీలావిధి నంతరంగముల వర్తింపంగ సర్వేశ్వరా. 109

మ. అమరేంద్రాబ్జభవాచ్యుతాదులకు నీయాజ్ఞాప్రభావం బలం
ఘ్యము నీకున్ భవదీయభక్తమహదాజ్ఞాపంబు నుద్యత్ప్రభా
వము లోకంబులలో నలంఘ్య మగుట న్వర్ణింపఁగా నీమహ
త్త్వముకంటెం గడుఁ జెల్లు భక్తులమహత్త్వం బెన్న సర్వేశ్వరా.

మ. శివసాహిత్యులసత్కరస్థలము కాశీక్షేత్ర మాహ స్తదే
శవిశాలోన్నతశాఖ లారయఁగఁ బంచక్రోశ మాపాణిసం
భవశోభాన్వితచిత్రరేఖలు మహాభాగీరథీతీర్థముల్
శివలింగం బలవిశ్వనాథుఁ డరయన్ సిద్ధంబు సర్వేశ్వరా. 111

మ. వరుసం బైకొని వచ్చుకర్మముల ము న్వారించి మాయామల
జ్వరము ల్దూల్చి యపారఘోరతరసంసారాబ్ధి లంఘించి భీ
కరసూక్ష్మాంగవిచిత్రకంచుకము వీఁకంబుచ్చిపోవైచి తాఁ
బరమవ్యోమము సొచ్చునీయచలసద్భక్తుండు సర్వేశ్వరా. 112

మ. పరమార్థం బగుతత్త్వ మారయఁగ నీపాదాబ్జసద్భక్తుఁ డౌ
క్కారుఁడుం దక్క సరోజజాద్యమరసంఘాతంబులో నెల్లఁ దా
నెరయం గాచికొనంగఁజాలరు మహానిర్భీతుఁడున్ లేఁ డతి
స్ఫురణం గాలుఁడు దన్ను వేచి పడిఁ గొంపోనుండ సర్వేశ్వరా. 113

మ. తనచారిత్రము తత్త్వవేత్త లగుభక్తశ్రేణి వర్ణింపఁగాఁ
దనచిత్తంబు భవత్పదస్మరణచేత న్నిన్ను మెప్పింపఁగా
ననుకూలస్ఫుటనిష్కలంకబహిరంగాభ్యంతరఁగస్థితి
న్వినుతిం బొందినతజ్ఞుఁ డీజగములో నీ మెచ్చు సర్వేశ్వరా. 114

మ. క్షితి నత్యుగ్రతపంబునందు జఠరాగ్నిం గ్రాఁగఁగా నేల మి
మ్మతిభక్తిస్థితిఁ బూజసేయుమహనీయత్వంబు తాఁ జాలదే
ప్రతిపక్షాలినడంప రోగభవదుర్భారంబు వారింపన
ద్భుతసౌభాగ్యముఁ బెంప దివ్యసుఖముం బొందింప సర్వేశ్వరా. 115

మ. శివవాక్యస్ఫురితాక్షరద్వయసకృజ్జిహ్వాప్రదేశాత్ముఁ డై
భవదుఃఖాంబుధి దాఁటు నన్న మఱి దత్పంచాక్షరీమంత్రము
త్సవలీలం గడు శుద్ధుఁడై జపము వాంఛంజేయు భాస్వద్గుణా
ఢ్యవసౌభాగ్యముమాన మెవ్వరికిఁ గాన న్వచ్చు సర్వేశ్వరా. 116

మ. అరిషడ్వర్గబలంబులో మలసి మాయావృత్తి నాయం దతి
స్ఫురణం జేసినవాఁడు మోహుఁ డతనిక్ బోఁ ద్రోచి నీభక్తితోఁ
బరఁగం గూర్చి వివేకిఁజేసి నెరయం బాటించి నాయం దధీ
శ్వరుఁడై యుండఁగదయ్య రౌప్యకుధరవ్యాపార సర్వేశ్వరా. 117

మ. అమలామ్నాయవిధిప్రబోధము లసంఖ్యాతంబు లైయుండు నా
గమమార్గోత్తమమంత్రతంత్రము లసంఖ్యాతంబు లైయుండుఁ ద
త్క్రమము ల్నా కవి యేల నీవు మెఱయంగా నిన్ను సద్భక్తియో
గమునం గొల్చి జయింపఁజేయు మిదె మత్కామ్యంబు సర్వేశ్వరా.

శా. ఏదేశంబున నేదిశాముఖమునం దేయూర నేవాడ మీ
పాదాభ్యర్చన సేయునిర్మలుఁడు సద్భక్తుం డొకం డుండెనా
యాదేశంబును నాదిశాముఖమును న్నాయూరు నావాడ గం
గాదిస్నాననదీప్రవాహఫలదంబై యుండు సర్వేశ్వరా. 119

మ. ఒనరం జిత్తము శుద్ధి లేనినరుఁ డుద్యోగంబునం గోరి చే
సినపూజావిభవంబు సువ్రతములున్ శీలంబులు న్మంత్రసా
ధనముల్ తీర్థములుం దపంబులును మీఁదం జెట్టవాఁ డభ్యసిం
చినశస్త్రాస్త్రకళానిభంబు లగుఁ జర్చింపంగ సర్వేశ్వరా. 120

మ. క్రమసంయుక్తి మనంబు బుద్ధియు నహంకారంబుఁ జిత్తంబు నా
యమలాంతఃకరణంబు నక్షరచతుష్కావాప్తిఁగాఁ దీర్చి పం
చమవర్ణంబుగ నాత్మఁ గూర్చి కడువాంఛన్ యోగి పంచాక్షరీ
సుమహన్మంత్రముతోడ నైక్యపదవిన్ శోభిల్లు సర్వేశ్వరా. 121

మ. భవదీయాననపంచకంబువలనం బంచాక్షరశ్రేణి యు
ద్భవమై తత్పదవర్ణపద్ధతుల శుంభత్పంచభూతంబు లు
ద్భవనంబై యఖిలంబుఁ బుట్టెను లసత్పంచాక్షరీమంత్ర మీ
భువనాండంబులఁ దల్లియై శుభములం బొందించు సర్వేశ్వరా. 122

మ. పటుశాస్త్రాగమదృష్టి నివ్విధమునన్ భావించి వీక్షించి యు
ద్భటవృత్తిన్ భవదీయభక్తినికరబ్రహ్మాండకుండైన నా
దట లోఁ గాచుకొనంగవచ్చు విదితోద్దండప్రతాపోత్కట
స్ఫుటకోపానలమూర్తియై యముఁడు కొంపోకుండ సర్వేశ్వరా. 123

మ. కలవారై మతిమంతులై రసికులై గంభీరులై ధీరులై
లలనామన్మథులై సముజ్జ్వలవచోలాలిత్యులై నిత్యులై
బలవిభ్రాజితులై యశోభరితులై భాసిల్లుభాగ్యోదయుల్
తొలిజన్మంబుల మిమ్ముఁ గొల్చినమహాత్ముల్ వారు సర్వేశ్వరా. 124

మ. ఖలులై యాచకులై విరుద్ధవికటాకారాంగులై పంగులై
బలహీనాతురులై రుజాపటలతాపచ్ఛన్నులై ఖిన్నులై
చలనాందోళితచిత్తులై మలినులై జాఘన్యులై శూన్యులై
యిలజన్మింపుదు రాత్మ నిన్నిడనివా రీక్షింప సర్వేశ్వరా. 125

శా. ఏయేవేళల నేవయస్సున నరుం డేభూమి నేయూరిలో
నేయేకర్మము నాచరించు నశుభం బేని న్శుభం బేని దా
నాయావేళల నావయస్సున నరుం డాభూమి నాయూరిలో
నాయాకర్మఫలంబుఁ జెల్లఁ గుడుచున్ దా నొంద సర్వేశ్వరా. 126

శా. ఆడం బోయినచోట బాలురు వినోదార్థంబు పాషాణముల్
గూడం బెట్టి శివాలయం బనుచుఁ బేర్కొన్నంతటం జేసి వా
రాడం బోయి సురాంగనాకలితదివ్యారామచింతామణి
క్రీడాశైలవిహారులై వెలయుటల్ గీర్తింతు సర్వేశ్వరా. 127

శా. కానీ దారసమన్వితుండు మిగులం గానీఁడు కందర్పునిన్
గోనీ మానవకోటిలో మరులు వైకోనీఁడు మోహంబునన్
రానీ రాజితరాజ్యవైభవము పైరానీఁడు గర్వంబునన్
లో నీవైనమహాత్ముఁ డన్యమునకున్ వోనీఁడు సర్వేశ్వరా. 128

మ. తమలింగార్చనకంటె జంగమము సౌందర్యంబుగాఁ గొల్చు టు
త్తమభక్తస్థితి లింగజంగమముల న్సామ్యంబుగాఁ జేఁత మ
ధ్యమభక్తస్థితి లింగపూజ నధికుండై జంగమోపాసనా
క్షముఁడై యుండుట భక్తియం దది కనిష్ఠత్వంబు సర్వేశ్వరా. 129

శా. శాకాబ్దంబులు వార్ధిషట్కపురజిత్సంఖ్యం బ్రవర్తింప సు
శ్లోకానందకరంబుగా మహిమతో శోభిల్ల సర్వేశ్వర
ప్రాకామ్యస్తవ మొప్పఁ జెప్పె శుభకృత్పరివ్యక్తవర్షంబునన్
శ్రీకంఠార్పితమై వసుంధరపయిం జెన్నొంద సర్వేశ్వరా. 130

మ. అభిరమ్యంబుగ దూదికొండ మహనీయారాధ్యసోమేశ్వర
ప్రభుకారుణ్యవసంతసంజనిత (మత్పద్య) మద్వాక్యప్రసూనావళి
న్విభవం బొప్పఁగఁ గూర్చి యెంతయు లసద్విఖ్యాతి సంపత్సుఖ
ప్రభవం బైన భవత్పదద్వయము నారాధింతు సర్వేశ్వరా. 131

శా. ఏ నిన్నే శరణందు బాంధవులు గానీ యెల్లవారుం బగే
కాని మృత్యువు తల్లక్రిందువడని కాలుండు గీవెట్టని
నానాకర్మచయంబు గింజుకొనని నాకేమి నేరాజ నిం
తే నీచాటున దాఁగియున్నపుడు భీతే యింక సర్వేశ్వరా. 132

శా. ధాత్రిన్భక్తజనానురంజనముగాఁ దత్త్వప్రకాశంబుగాఁ
జిత్రార్థాంచితశబ్దబంధురముగా సేవ్యంబుగా సజ్జన
శ్రోత్రానందముగా శుభాంచితముగా శోధించి సర్వేశ్వర
స్తోత్రం బన్నయచెప్పె నిజ్జగములో శోభిల్ల సర్వేశ్వరా. 133

శా. బాలుం డాడెడుమాటలెల్ల నుపమింపం దండ్రికిం బ్రౌఢభా
వాలాపంబులకంటె మించుగతి నే నజ్ఞానభావంబునం
దాలోచించి రచించినట్టికృతి యింపారంగ నీకు న్మహా
లాలిత్యస్తుతికంటెఁ గైకొనుఁగదా శ్లాఘ్యంబు సర్వేశ్వరా. 134

మ. పరమార్థంబుగఁ దత్త్వము న్నెఱుఁగ నొప్పం దీర్చి డెందంబు నీ
కరుణాస్థానముఁ జేర్ప లేక తనవంకం బాఱిపోనిచ్చిరే
నరకాబ్ధిం బడవైచుఁ దత్క్షణములోనం గానఁ దత్త్వజ్ఞమం
బరయం జిత్తము శూకలాశ్వము నిభంబై యుండు సర్వేశ్వరా. 135

మ. భవదంఘ్రిద్వితయార్చనంబును భవత్ప్రఖ్యాతసద్భక్తపుం
గవగోష్ఠీవిభవంబు నీవిమలసూక్ష్మధ్యానయోగంబు నా
నివిసంపూర్ణసుఖంబు లెన్న మఱి దేవేంద్రాదిభూతాఖిలో
త్సవసంబంధములెల్ల దుఃస్థితులు తథ్యం బెన్న సర్వేశ్వరా. 136

మ. సమయోద్దిష్టసహస్రపంకరుహపూజాపూరణార్థంబు నే
త్రము విష్ణుండు సుభక్తి యేర్పడ భవత్పాదంబు లర్చించి చ
క్రము నీచేఁ గొని దైత్యకోటి ననిలోఁ ఖండించెఁ దా నీపద
క్షమతాసేవ సమస్తదేవతలకున్ సత్త్వంబు సర్వేశ్వరా. 137

మ. అమర న్వేదపురాణశాస్త్రములు మున్నాకాంక్షఁ దత్త్వప్రభే
దములూహింపఁగ నేరవన్న మఱియాతత్త్వంబు లెట్లున్న ను [భక్తిస
త్తమసంతోషమె కోరు(నిన్నెపుడు ను)నేనినరుఁడుత్సాహించిని(భక్తిను)
త్తమసంతోషమొనర్చునే నతఁడు తత్త్వజ్ఞుండు సర్వేశ్వరా. 138

మ. అమితోద్యద్భవదీయతత్త్వము మహీయస్తోత్రవాణీవిలా
సము లై యొప్ప సమస్తవేదములు శాస్త్రశ్రేణియున్ దివ్యవి
భ్రమవాదంబులు నెన్ని చూడ నివి నీపంచాక్షరీమంత్రభా
వము లై యుండు సమస్తలక్షణముల న్వర్ణింప సర్వేశ్వరా. 139

శా. సంకీర్ణాకలితాక్షరత్రయము భాస్వన్నాదబిందుక్రమా
లంకారద్వితయంబుతోఁ గలసి లీలన్ దివ్యయోగీంద్రహృ
త్పంకేజోద్భూతములందు రూఢమగుచుం బంచాక్షరీమంత్ర మ
య్యోంకారాత్మక మై లసన్నిగమం బూహింప సర్వేశ్వరా. 140

మ. అమలజ్ఞానవికాసభాసురతనయ్యష్టాంగపూజావిధి
క్రమయోగంబుల నిన్ను నెల్లపుడు జోకం గొల్వఁగా నేల ని
క్కము నీభక్తులగోష్ఠి చాలుఁ గడువీఁకన్ ఘోరసంసారదుః
ఖము లెల్లం బెడవాపి నిన్ను వెలయుంగాఁ జూప సర్వేశ్వరా. 141

మ. జయశక్తి న్రవిచంద్రతారకముగాఁ జల్పెన్ యథావాక్యాలా
న్వయసంజాతుఁడు నన్నమార్యుఁ డవని న్వర్ణించి నీసత్కథా
క్రియ సంబోధన నీదుభక్తిని మహానిర్ణీతవిశ్రాంతిగా
భయవిభ్రాంతులు లేక యీశతకముం బ్రఖ్యాతి సర్వేశ్వరా. 142

సర్వేశ్వరశతకము సంపూర్ణము.

చెన్నపురి : 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1921.

ఆంధ్రగ్రంథములు.

ప్రతి 1-కి	రూ.	అ.
ఆంధ్రభారతవిమర్శనము, మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారిది	0	8
శకుంతలాపరిణయము, కృష్ణకవికృతము ...	0	12
తెనుఁగుసమస్యలు, చక్కనికూర్పు ...	0	2
భాస్కరరామాయణము, చక్కనికూర్పు, అత్యుత్తమప్రతి...	4	0
కృష్ణరాయవిజయము, కుమార ధూర్జటికృతము ...	0	8
లంకావిజయము (రావణదమ్మీయము), సటీక, ...	1	8
నిర్వచనోత్తరరామాయణము, సాధారణప్రతి ...	0	12
ఉత్తరరామాయణము, కంకంటి పాపరాజప్రణీతము, ...	2	4
రంగనాథరామాయణము, ద్విపద, చక్కనికూర్పు ...	3	8
గోపీనాథరామాయణము, 2 సంపుటములు శ్రీమద్రామాయణమునకుసరియైన పద్యము, కవనము మిక్కిలిసొంపు, పీఠిక అతివిపులము ...	5	8
మొల్లరామాయణము, చిన్నసైజున పెద్దయక్షరములతో చక్కగ ముద్రితము	0	10
అచ్చతెనుఁగురామాయణము, శుద్ధప్రతి ...	1	4
ఆంధ్రభాగవతము, పోతనామాత్యప్రణీతము, ఇదివఱకు ముద్రితమైన ప్రతులకన్న అన్నివిధముల బాగుగనున్నది ...	8	0
మార్కండేయపురాణము, మారనకృతము ...	1	12
మనుచరిత్ర, సటీక, వావిళ్ల. రామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో చిన్నసైజున మేలుకాకితముల మీఁద స్ఫుటమైన అక్షరములతో చక్కగ ముద్రించియున్నాము ...	2	0
వసుచరిత్రవిమర్శనము, శ్రీ చినసీతారామస్వామిశాస్త్రికృతము. అత్యద్భుతములగు క్రొత్తవిషయము లనేకము లిందుగలవు ...	1	0
ఆముక్తమాల్యద, వావిళ్ల. రామస్వామిశాస్త్రిగారివ్యాఖ్యానముతో మేలుకాగితములమీఁద చక్కఁగ మరల ముద్రించియున్నారము	3	8

		ప్రతి 1-కి రూ.	అ.
వసుచరిత్ర, సవ్యాఖ్యానము, చక్కనికూర్పు	...	8	8
ప్రభావతీప్రద్యుమ్నము, క్రొత్తకూర్పు	...	0	10
హరిశ్చంద్రనలోపాఖ్యానము, సటీక, పీఠిక విపులము	...	2	8
కళాపూర్ణోదయము, దళసరికాకితములు	...	2	4
రాఘవపాండవీయము, సటీక, చక్కనికూర్పు	...	2	4
శృంగారనైషధము, శ్రీనాథకవిది, క్రొత్తకూర్పు	...	1	0
హరవిలాసము ,,	...	0	12
కాశీఖండము, చక్కని క్రొత్తకూర్పు	...	1	8
సారంగధరచరిత్రము, చేమకూర. వేంకటకవికృతము	...	0	10
కవికర్ణరసాయనము, మాంధాతచరిత్ర	...	1	8
నరసభూపాలీయము, అట్టబెండు	...	0	10
విజయవిలాసము, చేమకూర వేంకటకవి	...	0	8
రంగరాయచరిత్ర, దిట్టకవి, నారాయణకవిప్రణీతము	...	0	8
రామాభ్యుదయము, అయ్యలరాజు, రామభద్రకవికృతము	...	1	4
నిరంకుశోపాఖ్యానము, రుద్రకవికృతము	...	0	6
నీలాసుందరీపరిణయము, కూచిమంచి తిమ్మకవికృతము	...	0	4
పారిజాతాపహరణము, మేలుప్రతి	...	0	8
హరిశ్చంద్రోపాఖ్యానము, శంకరకవిప్రణీతము	...	0	12
అనిరుద్ధచరిత్ర, కనుపర్తి. అబ్బయామాత్యప్రణీతము	...	0	8
విక్రమార్కచరిత్ర, జక్కనకవిప్రణీతము	...	1	4
తారాశశాంకవిజయము, చక్కనికూర్పు	...	0	12
బసవపురాణము, పిడుపర్తి సోమనాథప్రణీతము	...	2	4
హంసవింశతి, నారాయణామాత్యప్రణీతము	...	0	14
వేంకటాచలమాహాత్మ్యము, తరిగొండవెంకమ్మది, చక్కనికూర్పు		1	0
రాజయోగసారము, ద్విపద	...	0	4
చెన్నబసవపురాణము, పాపకవికృతము	...	1	2
పంచతంత్రము, నారాయణకవికృతము	...	0	12
జైమినిభారతము, అశ్వమేధపర్వము, చక్కనికూర్పు	...	1	0

		రూ.	అ.
సీతారామాంజనేయసంవాదము, సటీక, అనేక నూతనాంశములు చేర్చి చిన్నసైజున ముద్రించినారము. టీక, వివరణము మిక్కిలివిపులము. ఈవఱకు ప్రకటితమైన ప్రతులకన్న బాగుగనున్నది	...	8	8
నృసింహపురాణము, ఎఱ్ఱాప్రెగడ, క్రొత్తకూర్పు	...	0	12
వైశ్యపురాణము	...	1	4
ఉత్తరహరివంశము, నాచన సోమనాథకృతము	...	1	8
రుక్మాంగదచరిత్ర, ఏకాదశీమాహాత్మ్యము	...	0	10
బిల్హణీయము, చక్కనికూర్పు	...	0	8
వైజయంతీవిలాసము ,,	...	0	8
రుక్మిణీపరిణయము, శుద్ధప్రతి	...	0	8
రసికజనమనోభిరామము	...	0	12
రాజశేఖరవిలాసము	...	0	8
నీతిపద్యసంగ్రహము, సటిప్పణము	...	0	4
రుక్మిణీకల్యాణము, సటీక, చక్కనిప్రతి	...	0	8
అంబరీషోపాఖ్యానము, సటీక, (భాగవతము)	...	0	4
నలోపాఖ్యానము, సటీక, చిన్నసైజు	...	0	8
కుచేలోపాఖ్యానము, సటీక, (భాగవతము)	...	0	4
భోగినీదండకము, బమ్మెర పోతరాజప్రణీతము	...	0	1
గజేంద్రమోక్షము, సటీక, చక్కనికూర్పు	...	0	8
సప్తమస్కంధము, సటీక, చిన్నసైజు	...	1	4
భాగవతసప్తమస్కంధము, సాధారణప్రతి	...	0	6
వేమనపద్యములు, చక్కనికూర్పు	...	0	6
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సా[illegible]టువు, టీకానుక్రమణికాసహితము	...	0	12
అనంతుని ఛందస్సు, ఛందోదర్పణము	...	0	14
శ్రీనాథునివీధినాటకము	...	0	2
సులక్షణసారము, సటీక	...	1	0
ఆంధ్రభాషాభూషణము	...	0	2

	ప్రతి 1-కి రూ.	అ.
ఆంధ్రచంద్రాలోకము, సటీక ...	0	2
ఆంధ్రభాషార్ణవము ...	0	12
దసరాపద్యములు ...	0	2
రూపవతి, రాజపుత్రస్త్రీసాహసపుకథ శ్రీ ఏవమండ్ర నారాయణమూర్తి గారిది ...	0	8
విదురనీతి, సటీక, ఆంధ్రభారతములోనిది ...	0	5
చాటుపద్యమణిమంజరి, క్రొత్తకూర్పు ...	1	4
నలచరిత్ర, ద్విపద ...	0	14
హరిశ్చంద్రోపాఖ్యానము, గౌరనమంత్రి కృతము ...	1	4
ఆంధ్రద్రవిడబాలశిక్ష, అరవ మభ్యసింపదలచు ఆంధ్రులకు మిక్కిలి యుపయోగము ..	0	8
ఆంధ్రకన్నడబాలశిక్ష ...	0	3
హిందీ ఇంగ్లీషుబాలశిక్ష ...	0	4
హిందీ తెలుగుబాలబోధ ...	0	3
అధ్యాత్మరామాయణకీర్తనలు, చక్కని ప్రతి, చిన్నసైజు ...	0	10
రామదాసుచరిత్ర, చక్కనికూర్పు, మంచికాగితములు, ఇందు శ్రీ రామదాసుగారి ప్రతిమకూడకలదు ...	0	12

బ్రహ్మసూత్రములు తెనుఁగు వచనము.—

శ్రీశంకరులవారి భాష్యము అందరికిఁ దెలియుట దుర్లభమని తలఁచి చక్కని శైలిలో అనేకవృత్తుల ననుసరించి తె[illegible] వ్యాఖ్యానమును ప్రకటించినారము. రూ. 8 చెల్లించు[illegible]ందటి సంపుట మిప్పుడు పంపుదుము. పైజనవరిలో [illegible] సంపుటమును పోష్టుఖర్చులకు వీ. పీ. చేయుదుము.

రూ. 8-0-0

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.